

# కథా కౌముది

# పరాజితుడు

ఎస్.నాగేశ్వర రావు

మురారి కి ఈ రోజు బాగా దిగులుగా ఉంది. ఈ రోజనేమిటి గతకొన్ని రోజులుగా దిగులు పడుతూనే ఉన్నాడు. రోజులనటం కూడా తప్పే, గత రెండుమూడేళ్ళుగా అతను దిగులుగానే ఉన్నాడు. ఒక పక్షం రోజులనుండి అంటే సుబ్బారావు ఆ వార్త మోసుకొచ్చిన దగ్గర్నుంచి ఆ దిగులు బాగా పెరిగిపోయింది. ఇవాళైతే చెప్పలేనంత దిగులు, భరించలేని మనో వేదన, కృంగుబాటు. బహుశా ఈ పరిస్థితి చాలామందికి తమ జీవితాల్లో అనుభవమయ్యే ఉంటుంది.

పదిహేను రోజుల క్రితం ఒక సాయంకాలం సుబ్బారావు హడావుడిగా మురారి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు.

“బావా బావా ! ఒకసారి బయటకు రారా ! నీకో విషయం చెప్పాలి" సుబ్బారావు మురారిని హడావుడి పెట్టాడు. సుబ్బారావు మొహం చూస్తే వ్యవహారం ఏదో కొంప మునిగేట్లుగా ఉందని అనిపించి మురారి గబగబా బయటకు వచ్చాడు.

ఇద్దరూ మెట్రోకేఫ్ దగ్గరకు వచ్చారు. ఇబ్రహీం కొట్లో రెండు సిగరెట్లు కొనుక్కొని అంటించుకున్నారు.

సుబ్బారావు విషయం చెప్పటానికి తటపటాయిస్తున్నాడు. వాడు ఆలస్యం చేసినకొద్దీ మురారికి బీపీ పెరిగిపోతున్నది.

" చెప్పి చావరా చంపకుండా"

"చెప్పుతాను కానీ బావా ! నీవేమీ అఘాయిత్యం చేసుకోనని మాటివ్వరా"

మురారికి అర్థం కావటం లేదు వాడికి పిచ్చెక్కిందా ? తనకా ? ఇప్పుడు అఘాయిత్యం చేసుకునేంత వ్యవహారమేమిటో అర్థమయి చావలేదు.

సుబారావులో ఒక గొప్ప జబ్బుంది. మహా కంగారు గొడ్డు. కోడి గుడ్డు పెట్టిన విషయాన్ని కూడా వినేవాడికి చెమటలు పట్టేంత భయానకంగా చెప్పగలడు. ఎంత పట్టించుకోవద్దనుకున్నా ప్రతివాడు ప్రతిసారీ బోల్తా పడుతూనే ఉంటాడు. మురారి కూడా దానికి మినహాయింపేమీ కాదు.

అయితే ఈ సారి సుబ్బారావు చెప్పబోయేది మాత్రము నిజంగా మురారి గుండెలవిసిపోయే కబురే !

" చెప్పరా బాబు దండం పెడతాను" మురారి సుబ్బారావును బ్రతిమిలాడాడు.

" చెబుతాను కానీ తీరా చెప్పిన తర్వాత ఏడ్వకూడదు మరి "

" సరే ఏడ్చి చావనులే చెప్పు" మురారి హామీ ఇచ్చాడు.

" చెబుతున్నాను మరి ! గుండె దిటవు చేసుకుని విను. గాయత్రికి ఈ నెల 29 న పెళ్ళిరా !" అని చెప్పి మురారి మొహం వైపు చూసాడు.

సాగరాలు పొంగిపొర్లి ఘోషించ లేదు.. ధరాతలం పగిలి బద్దలయ్యి విస్ఫోటనం చెందలేదు. గాలి స్తంభించి ఊపిరి నిలిచి పోలేదు. ఆఖరుకు మర్రిచెట్టు మీద తీతువు కూడా అరవలేదు. ప్రకృతిలో ఏ చిన్న మార్పూ కనిపించలేదు.

ఇదంతా చూసి సుబ్బారావుకు ఆశాభంగం కలిగింది. సినిమాలలో ఇలాటి సమయాల్లో ఎలా చూపిస్తారో అతడికి క్షుణ్ణంగా తెలుసు. కాకపోతే బయట అలా ఎందుకు జరగలేదో మరి! అతడి సందేహాలు అతడివి.

అయితే సుబ్బారావు మురారి మొహాన్ని కొద్దిగా పరీక్షగా చూసి ఉంటే అతడి మొహం పాలిపోవటము గమనించి ఉండేవాడు. పెదాలు సన్నగా వణుకుతుండడము చూసి ఉండే వాడు. కళ్ళల్లో సన్నగా మెరుస్తున్న కన్నీటి చారను కూడా గమనించి ఉండేవాడు. అయితే తన కంగారు తనదే. ఇవన్నీ చూసే అవకాశం సుబ్బారావుకు లేదు. అనుకున్నంతగా మురారి విలవిల్లాడలేదు అది చాలు సుబ్బారావుకు.

నిజానికి మురారి గాయత్రి ని గత కొన్ని సంవత్సరాలుగా ఏకదీక్షగా ఏకపక్షంగా ప్రేమిస్తున్నాడు. అతడి వీరప్రేమ గురించి సందేహం లేదు. రకరకాల విన్యాసాల ద్వారా గాయత్రికి తన అమరప్రేమను తెలిపే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. కాకపోతే అవతల ఉన్నది జగమొండి. ఇలాటి కుప్పిగంతులకు బోల్తాపడే బాపతు కాదు. పైగా తెలివి కలది. ఈ కుర్ర ప్రేమలు చివరకు ఎంత చక్కగా తగలడతాయో పూర్తిగా అవగాహన ఉన్న అమ్మడు.

గాయత్రి చాలా బాగుంటుంది. ఎంత బాగుంటుందంటే గాయత్రి మంత్రమంత మహత్తరంగా ! గాయత్రి మంత్రంలో ప్రతి శబ్దం నిర్దిష్టంగా లయబద్ధంగా ఉంటుంది. మనము ఎంత తప్పు పలికినా ఒప్పుగానే వినిపిస్తుంది. భగవంతుడు కూడా ఆమె విషయంలో కాస్త ఎక్కువగానే పక్షపాతం చూపాడు. ఒక పరిపూర్ణ స్త్రీకి అవసరమైనవన్నీ నియమబద్ధంగా నిర్దిష్టంగా ప్రసాదించాడు.

ఋతువులలో శరదృతువు, శిశిరఋతువులు అద్భుతం. ప్రతి మనిషి తన జీవితంలో ఒక్కసారైన అనుభవించి తీరాల్సిన అనుభవం ఏదైనా ఉందా అంటే, ఏదైనా హిల్‌స్టేషన్లో ఆ రోజులలొ గడపటం. మరీ చల్లని కాని వాతావరణంలో మనను తాకుతూ వెళ్ళిపోతూండే మలయమారుతాల మధ్య మన అనుభూతి ఎలా ఉంటుందో ఊహించుకోండి, అలానే గాయత్రిని చూస్తే కలిగే అనుభూతి కూడా అలాంటిదే. కాకపోతే అన్ని అనుభూతులు అనుభవాలు అందరికీ ప్రాప్తం ఉండదు. అందుకే మురారికి అందనంత దూరంలో ఆ అదృష్టం ఉంది

గాయత్రిని మురారి ఏ సంవత్సరంలో మొదటిసారి చూసాడో గుర్తులేదుగానీ చూసిన వెంటనే ఫ్లాటయిన సంగతి మాత్రం ఎప్పటికీ మర్చిపోడు. అదంతా అతడికి ఒక తీపి కల. ఎప్పటికీ నెరవేరని ఒక పగటికల. కాకపోతే ఇందులో అతడి కృషిలోపం ఉందనుకోవటానికి వీలులేదు. మురారి తను చేయకలిగిన మానవ ప్రయత్నాలన్నీ చేస్తూనే ఉన్నాడు. ఏ ప్రయత్నం కలసి రాలేదు. చివరకు చాలామందికి ఆయాచితంగా వచ్చే బిరుదు మురారికి కూడా వచ్చిచేరింది. భగ్నప్రేమికుడు. సృష్ట్యాది నుంచీ కోటానుకోట్ల పరాజిత వీరప్రేమికులకు ప్రసాదించబడిన బిరుదు అది.

చివరకు సుబ్బారావు మురారిని బెదరగొట్టిన రోజు రానే వచ్చింది. ఈ రోజే గాయత్రి వివాహం. అందుకే మురారి దిగులుగా ఉన్నాడు. దిగులు అనటం కంటే దుఃఖంగా ఉన్నాడనటం సబబు.

----

ఈ రోజు గడచిపోయింది. రేపు కూడా వచ్చింది. తర్వాత కూడా చాలా రేపులు వచ్చాయి. రోజులు గడచిపోతూనే ఉన్నవి.

గాయత్రి పెళ్ళైన తర్వాత చాలారోజుల వరకు మురారి అన్యమనస్కంగానే ఉన్నాడు. దిగులుతో డీలా పడిపోయాడు.

ఒకరోజు మనశ్శాంతి కోసం కృష్ణ ఒడ్డుకు వెళ్ళాడు. ఈ మధ్య తరచూ చేస్తున్న పని అదే. నది ఒడ్డున చెత్తా చెదారం లేని ఒక ప్రదేశంలో బాసింపట్టు వేసుకుని తీరిగ్గా మళ్ళీ ఇంకొకసారి దిగులు పడటం మొదలు పెట్టాడు. మరపురాని బాధ కన్నా మధురమే లేదు, గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు.

దిగులు మధ్యలో ఆపేసి అటూ ఇటూ చూసాడు. కాసింత ఎడంగా ఒక సాధువు కళ్ళుమూసుకుని తపస్సో ధ్యానమో చేసుకుంటున్నాడు.

మురారి ఆ సాధువును పరీక్షగా చూసాడు. స్వామీజీ వర్చస్సు అదీ బాగానే ఉంది. ఎందుకో జ్ఞానిలా అనిపించాడు. లోకల్ టాలెంట్ అనుకుంటా, చూస్తానికి ఇక్కడివాడిలాగానే ఉన్నాడు. మరి హిమాలయాలకు పోయి తపస్సు చేసుకోకుండా ఇక్కడెందుకు కూర్చున్నట్లు ? బహుశా వెదర్ ప్రాబ్లెమ్ కామోసు ! అక్కడైతే చలి ఎక్కువగా ! ఇక్కడైతే చలి తక్కువగా ఉండి తపస్సుకు సౌకర్యంగా ఉంటుందనుకుని మొదలెట్టి ఉంటాడు.

మురారి ఈ ఆలోచనల్లో తలమునకలుగా ఉండగా ఆ స్వామీజీ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. బహుశా తపస్సు నుండి కాసేపు రిలాక్స్ అవుదామని డ్యూటీ దిగి ఉంటాడు. గడ్డమూ అదీ బాగానే పెరిగిఉంది. కాషాయ బట్టలు నీరెండలో మెరుస్తున్నవి. చుట్టూ పరికించాడు. అంత దూరంలో

మురారి తనను చూస్తూ కనిపించాడు. రిలాక్స్ కావాలంటే కాస్త కాలక్షేపం కావాలిగా !

మురారిని రమ్మని సైగ చేసాడు.

మురారికి వణుకు పుట్టింది. వెళ్ళాలంటే భయం. ఏమైనా చేస్తాడేమోనన్న అనుమానం. వెళ్ళకపోతే మంత్రం పెట్టి శపిస్తాడేమోనని భయం. ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు.

మళ్ళీ స్వామీజీ సైగ చేసాడు. ఎరక్కపోయి వచ్చి ఇరుక్కుపోయానురా దేవుడా అనుకున్నాడు. ఏది ఏమైనా స్వామీజీ దగ్గరకు వెళ్ళకుండా ఉండేందుకు ధైర్యం చాలలేదు. సరే ! ఏమైతే అదౌతుందనుకుని ప్రాణాలరచేతిలో పెట్టుకుని స్వామీజీని సమీపించాడు.

దగ్గరకు వెళ్ళిన తర్వాత స్వామీజీని పరీక్షగా చూసాడు. ఏమంత ప్రమాదకరంగా కనిపించలేదు. కొద్దిగా ధైర్యం చిక్కపట్టుకున్నాడు. ముందు జాగ్రత్తగా ఎందుకైనా మంచిదనుకుని ఒక నమస్కారం పడేసాడు. స్వామీజీ కూడా కాస్త ప్రసన్నుడయ్యాడు.

" ఏం నాయనా ! దిగులుగా ఉన్నావు. లవ్ ఫెయిల్యూరా !"

" తమకెలా తెలుసు స్వామీ? !" మురారి ఆశ్చర్యంతో అడిగాడు.

" అనుభవం నాయనా ! వెర్రి వేయి విధాలు అందులో ఇది ఒకటి. వెర్రివెధవలను చూడగానే పోల్చుకోగలను తండ్రీ ! ఆ శక్తి నాకుంది"

మురారి నోరు విప్పలేదు.

"ఇంత దిగులుగా ఉన్నావు. అంత గాఢంగా ప్రేమించుకున్నారా నాయనా!?"

ఊహూ కు ఆహా కు మధ్యలో ఉండేట్లు మురారి తలాడించాడు.

" ఆ అమ్మాయి నిన్ను ప్రేమించిందా నాయనా?" స్వామీజీ ధర్మసందేహం.

"లే లే లేదు స్వామీ" మురారి చెప్పలేక చెప్పాడు.

"మరెందుకు నాయనా ఈ వెధవ ఏడుపు"

"ఏమో స్వామీ! అదే తన్నుకొని తన్నుకొని వస్తున్నది"

" టూ వే గాళ్ళకే దిక్కు లేదు. ఒన్ వే గాడివి నీకింత ఏడుపు అవసరమా చిరంజీవీ ?"

"ఏమో స్వామీ! నాకీ బ్రతుకు మీద విరక్తి కలుగుతోంది. ఏమి చేయాలో పాలుపోవటం లేదు" మురారి స్వామీజీతొ వాపోయాడు.

మునిగిపోయేవాడికి గడ్డిపోచ కూడా అధారమే. ప్రస్తుతం స్వామీజీ కూడా మురారికి అంతే, అదీకాక దగ్గరనుండి చూసిన తర్వాత స్వామీజీ మీద కాస్త గౌరవం కలిగింది.

"స్వామీ! మీరు జ్ఞానులు. నాకీ వేదన నుండి ఉపశమనం కలిగే మార్గం శలవీయండి స్వామీ" మురారి స్వామీజీని వేడుకున్నాడు.

"తప్పదా నాయనా?!"

"తప్పదు స్వామీ"

"నీకు నాలుగయిదు పరిష్కారాలు చెప్పుతా నాయనా ! అందులో నీకేది బాగుంటే అది అనుసరించు, నీకు వేదన నుండి విముక్తి కలుగుతుంది"

"అలాగే" మురారి తలాడించాడు.

"మొదటి పరిష్కారం ఆత్మహత్య నాయనా ! అన్ని సమస్యలూ ఒక్క దెబ్బతో సమసిపోతవి. నీవు కూడా ఆట్టే కష్టపడనవసరం లేదు దానికి కూడా నాలుగయిదు సులువైన పద్దతులున్నవి. వాటిని వివరంగా నీకు అర్ధమయ్యేట్లు చెబుతానుగా, కంగారు పడకు" స్వామీజీ మొదటి సలహా వదిలాడు.

మురారికి ముందు ఒళ్ళు జలదరించింది, తర్వాత మండింది.

"ఇదేం దిక్కుమాలిన సలహా స్వామీ? చచ్చింతర్వాత ఇంక పీకేదేముంటుంది ?" కొద్దిగా కోపంగానే మురారి స్వామీజీని అడిగాడు.

" అనుకున్నాను నీకు ఈ సలహా ఆట్టే నచ్చదని. సరే ! ఇంకొక ప్రశస్తమైన సలహా ఉంది, దాన్ని ట్రై చేద్దాము"

" సెలవివ్వండి స్వామీ" మురారికి నిరుత్సాహం కమ్ముకొచ్చింది. ఇదెంత లక్షణంగా ఉంటుందో చూద్దామనుకున్నాడు.

"మీలాటివారికి ఆదిగురువైన దేవదాసు చూపిన బాట నాయనా ! అద్భుతమైనది. ఉన్నదంతా అయ్యేదాకా, ఆ తర్వాత అప్పోసప్పో చేసి తాగి అడ్డంగా పడుతూ లేస్తూ నెమ్మదిగా నెమ్మదినెమ్మదిగా కీర్తిశేషుడవటము. ఈ సలహా నీకు తప్పకుండా నచ్చుతుంది కదూ" సందేహ నివృత్తి కోసం స్వామీజీ మురారి మొహంలోకి పరీక్షగా చూసాడు.

స్వామీజీ మీద గౌరవం తగ్గింది. శ్రీవారి సలహా విని అరికాలి మంట నెత్తికెక్కింది మురారికి.

"ఈ సలహా తమ బొందలే ఉంది స్వామీ. నేను వెధవలాగా ఉన్నందంతా ఊడ్చి తాగి తాగి రోడ్లకడ్డంగా పడిపోతూ ఉంటే, అందరూ నన్ను రోతగా చూస్తూంటే నెమ్మది నెమ్మదిగా చావాలా ? తమకెలా మనసొప్పింది స్వామీ ఇలాటి వెధవ సలహాలివ్వటానికి. దీనికంటే మొదటి సలహానే బాగుందిగా కనీసం అస్తయినా మిగులుతుంది" మురారి ఉక్రోషంగా సమాధానమిచ్చాడు.

" సరే! సరే! ఇంకో సలహా చెబుతాను విను. ఆట్టే ప్రమాదమూ కాదూ ఖర్చూ లేనిది" ఏది ఏమైనా మురారికి స్వామీజీ మీద నమ్మకం తగ్గింది.

"చెప్పండి స్వామీ" మురారి పెద్ద ఉత్సాహం చూపలేదు.

"నాయనా ! మానవుని కష్టాలకు మూలం ఈతి బాధలేనని తెలుసుగా ! ఈ భవబంధాలు మనిషి జీవితంలో పెనవేసుకుపోయే కదా మానవుడు అష్టకష్టాలు పడుతున్నది" స్వామీజీ మొదలు పెట్టాడు.

మురారి మదిలో రాబోయే ప్రమాదానికి సూచన తళుక్కుమన్నది. మరో దిక్కుమాలిన సలహా తనమీదకు విసరబోతున్నాడన్నదానికి సంకేతాలు స్పష్టంగా గోచరిస్తున్నవి. కోరి గోక్కుంటున్న కొరివి. తప్పించుకోవటానికి అవకాశమూ లేదు వ్యవధీ లేదు. చక్రబంధంలో ఇరుక్కుపోయాడు తను.

"కాబట్టి నాయనా ! భవబంధాలు తెంచుకో! కోరికలు చంపుకో! కుటుంబాన్ని బంధుమిత్రులను పరిత్యజించు. ఇహలోక సౌఖ్యాలను వదులుకో. సన్యసించు. నా శిష్యుడుగా చేర్చుకుంటాను. నాతోపాటే నీవూ ఊళ్ళమీద పడి తిరుగు. ఎక్కడికెళ్ళినా ఫుడ్డు ఫ్రీ. రైళ్ళలో ప్రయాణం ఫ్రీ." స్వామీజీ ఉవాచించాడు.

ఒక్కసారిగా మెడమీద కాళ్ళజెర్రి పాకినట్లనిపించి మురారికి శరీరం గగుర్పొడిచింది . మొహం మీద నల్లబల్లి నిలువుగా పడినట్లు వళ్ళు జలదరించింది. జీవితం మీద ఒక్కసారిగా రోతపుట్టింది. ఒంట్లోని రక్తమంతా మొహంలోకి వచ్చిచేరినట్లు మొహం ఎర్రబడింది. పెదాలు అసహాయంగా వణికినవి.

"స్వామీ! ఇంత నీచమైన సలహా ఎలా ఇవ్వగలిగారు. మీతో పాటు అడుక్కుతినాలా ? మీతో పాటు మరుగుదొడ్ల పక్కన కూర్చుని ఊళ్ళు తిరగాలా ? నేను ఒక పక్క కష్టాలతో నా జీవితం పాడయ్యి ఏడుస్తూంటే ఇవా మీరు ఇవ్వగలిగిన సలహాలు. ఇన్నాళ్ళు కాషాయం కట్టేవాళ్ళంతా గౌరవనీయులనుకున్నా. అది పెద్ద తప్పని మీ మూలంగా తెలుసుకున్నాను. వస్తాను స్వామీ! శలవు.నమస్కారం" మురారి ఉక్రోషంతో లేవబోయాడు వెళ్ళిపోవటానికి.

"కూర్చో" లేవబోయిన మురారి స్వామీజీ చేతిసైగతో కూర్చున్నాడు. కోపాన్ని అణుచుకోవటానికి చాలా కష్టపడాల్సి వస్తున్నది. తలవంచుకుని నిగ్రహించుకుంటున్నాడు.

"నాయనా ! నీకు నిండా పాతికేళ్ళు లేవు. జీవితంలో నీకు జరిగిన అతి చిన్న ఆశాభంగానికి జీవితం మీద విరక్తి పెంచుకుని రోడ్లుపట్టుకుని తిరుగుతున్నావు" స్వామీజీ స్వరం మృదువుగా మార్దవంగా పలికింది.

చివాలున మురారి తలెత్తి స్వామీజీని చూసాడు. ఇందాకటి స్వామీజీలాగా అనిపించలేదు. ప్రశాంతంగా మురారి వైపే చూస్తున్నాడు. ఆయన మొహంలో దయ కనిపించింది. వదనం వెలుగుతో ప్రకాశిస్తున్నది. మురారి అయోమయంలో పడిపోయాడు.

"నాయనా! నీకు దొరికిన ఈ జీవితం నీవు అడక్కుండా భగవంతుడు నీకిచ్చిన వరం. కేవలం ఒక ఆడపిల్ల విషయంలో భంగపడి జీవితం మీద విరక్తి పెంచుకుని ఆ వరాన్ని నాశనం చేసుకోవటానికి మాత్రంకాదు. నీవు ఏదో సాధించాలనే భగవంతుడు నిన్ను భూమ్మీదకు పంపి ఉంటాడు. నీకంటే మహామహులు నీకన్నా ఎక్కువే కష్టాలు పడ్డారు. ఆఖరుకు భగవంతుడు కూడా మానవజన్మలో నీవు పడిన కష్టాలకంటే ఎక్కువే పడ్డాడు."

స్వామీజీ కాసేపు ఆగాడు. మురారి స్వామీజీని చూడటానికి సాహసించలేదు. తలవంచుకునే కూర్చున్నాడు.

" నిజానికి నీకు వచ్చింది కష్టం కూడా కాదు. అతి చిన్న ఆశాభంగం. కష్టమంటే తెలియాలంటే తమను తాము ఇతర జంతువుల నుండి కాపాడుకుంటూ, బ్రతకటానికి ఆహారాన్ని సంపాదించుకోవాల్సిన జంతువులను అడుగు, అవి నీకు విడమర్చి చెప్తుతాయి. లేదా ఆఫ్ఘనిస్తాన్‌లోనో ఇథియోపియా సొమాలియా లాటి దేశాలలో బ్రతుకుతున్న నీ సాటి మనుషులను చూడు నీకు కష్టమనే మాటకు అసలు అర్థం తెలుస్తుంది."

మురారి తలవంచుకునే వింటున్నాడు. స్వామీజీ మృదువుగా తన హితబోధ కొనసాగించాడు.

" నూరు జన్మల తర్వాత మానవజన్మ లభిస్తుందంటారు. అది నిజం కావచ్చు కాకపోవచ్చు. కానీ నిశ్చయంగా మానవజన్మ సర్వోత్కృష్టమన్న మాట మాత్రం నిజం. విధాత నుదుట రాస్తాడంటారు, ఆ ప్రకారమే జరుగుతుందంటారు. అది సరి అని నేననుకోను. మానవప్రయత్నమనేది మనం చేయాలి. భగవానుడు మానవాళికి తెలియచెప్పింది కూడా అదే. కానీ విషాదమేమిటంటే నీవు ఆ పని కూడా సరిగా నిర్వర్తించలేక పోయావు. అవతలి మనిషిని మెప్పించటానికి నీవు చేసినదేమిటో నిజాయితీగా ఆలోచించు, నీ ఈ పరిస్థితికి సమాధానం లభిస్తుంది. కేవలం నీ రూపురేఖలకు విన్యాసాలకు నీతో ప్రేమలో పడిపోతే అంత బలహీనమైన పునాదులమీద ఏర్పడిన ప్రేమ ఎంతకాలం మన్నుతుంది నాయనా! అందుకే అనేకానేక బలహీనప్రేమ వివాహాలు దయనీయంగా మారిపోతున్నవి. కనీసము నీకా దురవస్థ తప్పింది. సంతోషించు. ఆ అమ్మాయి కూడా ఆ రకంగా అదృష్టవంతురాలే !"

స్వామీజీ మురారి చుబుకాన్ని వేలితో లేపాడు. మురారి కళ్ళలోకి సూటిగా చూసాడు. ఆ చూపులో కరుణ ఉంది. జాలి ఉంది. విశ్వజనీన ప్రేమ ఉంది.

"నాయనా! నీకు ఉన్నది ఒకటే జననం ఒకటే మరణం ఆ రెండిటి మధ్యలో ఉన్నది లిప్తపాటు జీవితం. మనిషి దేవుడు కాలేక పోవటం తప్పు కాదు, కానీ మనిషి కూడా కాలేక పోవటం మాత్రం నిశ్చయంగా తప్పే. నీవు గొప్పగా బ్రతకలేకపోవచ్చు కానీ తప్పుగా మాత్రం బ్రతకకు. పదిమందికి ఆదర్శప్రాయంగా ఉండు కుదరకపోతే కనీసం పదిమందికి అసహ్యకరంగా మాత్రం ఉండకు. ఇంతకంటే నేను నీకు చెప్పగలిగేది కూడా ఏమీ లేదు. వెళ్ళిరా నాయనా ! మనం మళ్ళీ కలుసుకోలేక పోవచ్చు. కానీ నా ఆశీస్సులు ఎప్పుడూ నీకు ఉంటవి. వెళ్ళిరా!"

భగవంతుడూ ఎక్కడో పైలోకాల్లో విహరిస్తూ ఉండడు. మనతోనే ఉంటాడు మన మధ్యే ఉంటాడు. కాకపోతే మనం గుర్తించ కలగాలి. మురారికి స్వామీజీలో భగవంతుడు గోచరించాడు. ఆత్మ సాక్షాత్కారమైంది. స్వామీజీకి పాదాభివందనం చేసి వెనక్కి తిరిగాడు.

ఆ తర్వాతెప్పుడూ మురారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకోలేదు. మంచి మనిషిలాగానే బ్రతికాడు. మంచి స్థాయినే చేరుకున్నాడు. మంచి భర్త అయ్యాడు, మంచి తండ్రి అయ్యాడు, మంచి స్నేహితుడయ్యాడు. మంచి పౌరుడయ్యాడు.

అయినా గాయత్రి అతడి జ్ఞాపకాల పొరల్లోంచి తొలగిపోలేదు.

గుండెలోతుల్లో ఆమె పదిలంగానే ఉన్నది. అప్పుడప్పుడూ గాయత్రిని పలుకరిస్తూనే ఉంటాడు.

Click here to share your comments on this story